RNI No - APTEL/2022/81596

# జనోదయ

కరీంనగర్ ఆదివారం15.03.2026 సంపుటి : 03 సంచిక : 99 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Sunday 15.03.2026 Volume: 03 Issue 99 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## జస్టిస్ రమణ మీకిది తగునా?

**రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం ఏంటి?**

**నేతలకు సలహాలివ్వడం ఏంటి?**



6లో

# ముదురుతున్న సంక్షోభం

- గ్యాస్ కొరత తీవ్రతరం.. జనానికి తప్పని తిప్పలు
- దేశవ్యాప్తంగా హోటళ్లపై తీవ్ర ప్రభావం
- పనులు కోల్పోయి వలస కార్మికుల ఇంటిబాట
- కొరత లేదంటూనే ఆంక్షలు విధిస్తున్న కేంద్ర సర్కార్
- పీఎన్‌జీ కనెక్షన్ ఉన్న వారికి డొమెస్టిక్ ఎల్పీజీ బంద్



**న్యూఢిల్లీ, మార్చి 14:** దేశంలో గ్యాస్ సంక్షోభం ముదురుతున్నది. సమస్యను అధిగమించేందుకు హోటళ్లు, రెస్టారెంట్లు తమ మెనూను తగ్గించుకోవడం, ఆహార పదార్థాల రేట్లను పెంచడం వంటి చర్య లు చేపట్టగా కొన్ని రెస్టారెంట్లు బొగ్గు, కట్టెల పొయ్యి వంటి సంప్రదాయ వంట పద్ధతులకు మరలాయి. దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో చిన్న హోటళ్లు మూతప డుతుండగా ఉత్తరప్రదేశ్, కర్ణాటకలో అక్రమంగా నిల్వచేసిన ఎల్పీజీ స్థావరాలపై అధికారులు దాడులు నిర్వహిం చారు. దేశ రాజధాని ఢిల్లీలోని రెస్టారెం ట్లలో కార్పొరేట్ విందు సమావేశాలు, గ్రూపు పార్టీలు నిలిచిపోయాయి. ఎల్పీజీ కొరత కారణంగా పెద్ద సంఖ్యలో అతిథులకు విందును సమకూర్చడం తమకు సాధ్యం కాదని నిత్యం రద్దీగా ఉండే కన్నాట్ ప్లేస్‌లోని రెస్టారెంట్ల యజమానులు చేతులెత్తేస్తున్నారు. తక్కువగా గ్యాస్ ఖర్చయ్యే వంటకాలనే తమ మెనూలో ఉంచినట్లు ఫ్లేవర్స్ ఆఫ్ చైనా హోటల్ యజమాని పరంజీత్ కౌర్ చెప్పారు. మరోవైపు గ్యాస్ కోసం పడిగా పులు కాస్తూ ప్రజలు ప్రాణాలు కోల్పో తున్నారు. పంజాబ్‌లో శుక్రవారం ఒకరు ప్రాణాలు కోల్పోగా, తాజాగా యూపీలో ఓ వృద్ధుడు మరణించాడు.వివిధ రాష్ట్రాల్లో ఎల్పీజీని అక్రమంగా నిల్వ చేసిన స్థావరాలపై అధికారులు దాడులు చేసి పలువురిని అరెస్ట్ చేశారు. వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించేందుకు అక్రమంగా గృహవినియోగ ఎల్పీజీని నిల్వచేసిన స్థావరంపై దాడి చేసిన కర్ణాటక ఆహార, పౌర సరఫరాల శాఖ అధికారులు 316 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గ్యాస్ సిలిం డర్లను అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్న కోలార్ జిల్లాలోని కేజీఎఫ్‌లో ఓ గ్యాస్ ఏజెన్సీపై అధికారులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్ ఆహార, పౌర సరఫరాల శాఖ 1,483 ప్రదేశాలపై దాడులు చేసి వంటగ్యాస్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసింది. మొత్తం 24 ఎఫ్ఐఆర్‌లు రాష్ట్రంలో నమోదయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని అనేక జిల్లాల్లో ఎల్పీజీ కోసం ప్రజలు గ్యాస్ ఏజెన్సీల ముందు బారులు తీరి నిలబడ్డారు.

## పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదు : కేంద్రం

కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని భరోసా ఇచ్చింది. కంగారు పడి కొనుగోళ్లకు దిగవద్దని ప్రజలకు సూచించింది. సాధారణ కంటెయినర్‌లలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరించింది. తమిళనాడులో ఒక పెట్రోల్ బంక్ నుంచి సాధారణ కంటెయినర్‌లో పెట్రోల్ తరలించిన వైనం తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఈ సూచన చేస్తున్నట్టు తెలిపింది. ఇలాంటి చర్యలతో భద్రతాపరమైన ముప్పు పెరుగుతుందని హెచ్చరించింది. ఇలా పెట్రోల్‌ను విక్రయించిన రిటైల్ ఔట్‌లెట్‌పై తగిన చర్యలు తీసుకున్నామని కూడా పెట్రోలియం శాఖ వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ విక్రయాలకు సంబంధించి పెట్రోల్ పంప్‌లు, డీలర్లకు భద్రతాపరమైన మార్గదర్శకాలు జారీ చేశామని కూడా కేంద్రం పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

## గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

**గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు**

**కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బంది ఉంది**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**



**గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. రాష్ట్రంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అయితే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంత ఇబ్బంది ఉన్నట్లు వెల్లడిం చారు.**

6లో..

## ప్రజల కోసమే.. ఆశీర్వాద యాత్ర



6లో..

## యుద్ధంపై భయపడకండి

**యుద్ధం ఎఫెక్ట్‌పై భయాందోళనలు సృష్టిస్తున్న కాంగ్రెస్**

**మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది**

**కాంగ్రెస్‌కు దేశం గురించి ఎలాంటి విజన్ లేదు**

**అస్సాంలో ప్రధానమంత్రి మోదీ**

**సిల్చార్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ (ఛ్రుతీవఅఎతీఖ వీశీఎఱ) అస్సాంలోని సిల్చార్‌లో శనివారంనాడు పర్యటించారు. రూ.23,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.22,864 కోట్లతో సిల్చార్-మేఘాలయలోని షిల్లాంగ్ మధ్య నిర్మించనున్న యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా ఏమాత్రం బాధ్యతలేని విపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు. అస్సాం ప్రజలను హింస, ఉగ్రవాదం వైపు కాంగ్రెస్ తప్పుదారి పట్టించిందని, అయితే ఇవాళ రాష్ట్రంలో సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని అన్నారు.'ఇవాళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. దేశ ప్రజలపై ఆ ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. వారి రక్షణ, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆశిస్తాం. అయితే దేశ ప్రయోజనాల



పరిరక్షణలో కాంగ్రెస్ మరోసారి విఫలమైంది. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది. అంతర్జాతీయంగా భారత్ శీఘ్ర అభివృద్ధిని సాధించడం కొన్ని శక్తులకు ఇష్టంలేదు. అలాంటి శక్తుల చేతిలో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారింది' అని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.కాంగ్రెస్ పార్టీకి అస్సాం గురించి కానీ, దేశం గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పు పట్టారు. మోదీని దూషించడం, అబద్ధాలు, వదంతుల ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే ఆ పార్టీకి తెలుసునని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు.

## సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధం రద్దు

### కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ:** ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిర్బంధాన్ని రద్దు చేస్తూ కేంద్రం శనివారంనాడు కీలక నిర్ణయం తీసుకుంది. లద్దాఖ్‌లో జరిగిన హింసా త్మక ఘటనలకు సంబంధించి హింసను ప్రేరేపించారనే ఆరోపణలపై గత ఏడాది సెప్టెంబర్ 26న వాంగ్ చుక్‌ను నిర్బం ధంలోకి తీసుకున్నారు. జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టయిన ఆయన అప్ప ట్నించి జోధ్‌పూర్ జైలులో ఉంటున్నారు. హింసాత్మక ఘటనల అనంతరం శాంతిభద్రతల దృష్ట్యా ఆయనను నిర్బంధంలోకి తీసుసుకున్నట్టు దీనిపై కేంద్రం వివరణ ఇచ్చింది. లద్దాఖ్‌లో శాంతియుత వాతావరణం, సుస్థిరత, పరస్పర విశ్వాసాన్ని పాదుకొలిపేందుకు, భాగస్వామ్య పక్షాలతో అర్థవంతమైన చర్చలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రం తాజాగా ప్రకటించింది. ఈ లక్ష్య సాధన కోసం తగిన పరిశీలన అనంతరం జాతీయ భద్రతా చట్టం కింద తమకు సంక్రమించిన అధికారులను ఉపయోగించుకుని వాంగ్‌చుక్ నిర్బంధాన్ని రద్దు చేయాలని నిర్ణయించినట్టు తెలిపింది. తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. లద్దాక్ ప్రజల ఆకాంక్షలు, ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని భాగస్వామ్య పక్షాలు, కమ్యూనిటీ లీడర్లతో చర్చలు జరుపుతున్నట్టు తెలిపింది.లేహ్‌లో గత ఏడాది సెప్టెంబర్‌లో ఆందోళనలు చోటు చేసుకున్నాయి. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లోకి చేర్చాలని, రాష్ట్ర హోదా కల్పించాలనే డిమాండ్లతో చేపట్టిన



ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో నలుగురు చనిపోగా, సుమారు 90 మంది గాయపడ్డారు. హింసను ప్రేరేపించారంటూ వాంగ్‌చుక్‌ను నిర్బంధంలోకి తీసుకున్నారు. సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, వీలైతే ఆయన నిర్బంధాన్ని సమీక్షించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు ఇటీవల సూచించింది.

## పెట్రోల్‌ను లూజ్‌గా అమ్మడం నిలిపేయండి

**పెట్రోల్ పంపులకు కేంద్రం వార్నింగ్**

ఇరాన్‌పై ఇజ్రాయెల్ , అమెరికా యుద్ధం నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముందు జాగ్రత్తగా పెట్రోల్ , డీజిల్‌ను.. సీసాలు, డబ్బాలు లాంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీచేసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది.ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేసి, సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నది.ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడంవల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది.



# పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం

**హనుమకొండలో**
**పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



**జనోదయ,హనుమకొండ, మార్చి 14:**

హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హై స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు కల్పించిన తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన పరిసరాలు, టాయిలెట్ వసతులు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణ దృష్ట్యా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల్లో వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీల సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరి రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన వాతావరణంతో మానసికోల్లాసం

**కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో**
**స్వచ్ఛత కార్యక్రమం**



**జనోదయ : చెన్నూరు ఆర్సీ, మార్చి 14 :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నేడు కోటపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ మరియు కోటపల్లి ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అందరూ సమిష్టిగా నడుంబిగించి స్టేషన్ పరిసరాలను అద్దంలా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా అధికారులు మరియు సిబ్బంది స్వయంగా శ్రమదానం చేస్తూ, స్టేషన్ లోపల మరియు వెలుపల ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రత పట్ల తమ నిబద్ధతను చాటారు.ఈ కార్య క్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అస్తవ్యస్తంగా పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కేవలం పరిసరాలనే కాకుండా, స్టేషన్‌లోని రికార్డులను సైతం క్రమపద్ధతిలో సర్దుతూ, దుమ్ము ధూళి లేకుండా శుభ్రపరిచారు. విధి నిర్వహణలో నిరంతరం బిజీగా ఉండే సిబ్బంది, సామాజిక బాధ్యతగా భావించి ఈ స్వచ్ఛత యజ్ఞంలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు మరియు ప్రజలకు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సమ స్యలతో స్టేషన్‌కు వచ్చే వారు ఇక్కడి పరిసరాలను చూసి మానసిక ప్రశాంతత పొందేలా ఉండాలని, అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ స్వచ్ఛత దిశగా అడుగులు వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పరిశుభ్రమైన వాతావరణం పని ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, ప్రజల్లో పోలీసుల పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సింగరేణి పరిరక్షణ పోస్టర్ల ఆవిష్కరణ



**జనోదయ : మందమర్రి మార్చి 14:**

సింగరేణిలో రాజకీయ జోక్యం తగ్గించి, సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన 50 వేల కోట్లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సింగరేణి పరిరక్షణ పోరాటం పోస్టర్లను ఏఐటియుసి నాయకులు ఆవిష్కరించారు. ఏరియాలోని వర్క్ షాప్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్క్ షాప్ పిట్ సహాయ కార్యదర్శి ఎగ్గటి రాజేశ్వరరావు ,ఏరియా నాయకులు పెద్దపల్లి బానయ్యలు మాట్లాడారు.సింగరేణిలో మెడ కల్ బోర్డు పాత పద్ధతిలో వెంటనే నిర్వహించాలని, సొంతింటి కల నెరవేర్చాలని, పెర్క్స్‌పై ఇన్కమ్ టాక్స్‌ను యాజమాన్యమే భరించాలని, మారు పేర్లను సరిచేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం వచ్చే నెలలో కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని కోరారు. ఈనెల 17వ తేదీన సింగరేణి వ్యాప్తంగా అన్ని గనుల డిపార్ట్మెంట్లపై నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ మెమొరండాలు అందజేయడం, ఈనెల 18నుండి 30 వరకు సేవ్ సింగరేణి బస్సు జాత గోలేటి నుండి కొత్తగూడెం వరకు సింగరేణి కార్మికులను చైతన్యపరుస్తూ ప్రభుత్వానికి యాజమాన్యానికి కను విప్పు కలిగే విధంగా కార్యక్రమాలను చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కన్నం వేణు, సాధనవేణి ప్రభాకర్, బైరి పోశాలు,రామ్ రెడ్డి, రమేష్,రాజేందర్ పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన పార్టీ
# ఆవిర్భావ వేడుకలు



**జనోదయ : మందమర్రి మార్చి 14:**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఐబిలోని అంబేద్కర్ విగ్రహానికి జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రెడ్ క్రాస్ సొసైటీలో అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం ఐబిలోని పార్టీ జెండాను జిల్లా నాయకులు తన్నీరు మధుకర్ ఆవిష్కరించి మాట్లాడారు. జనసేన పార్టీ ఆవిర్భవించి నేటికీ 12 సంవత్సరాలు పూర్తి అయిందన్నారు. జనసేనాని పవన్ కళ్యాణ్ కృషితో గత 12 సం,,గా పార్టీ ప్రజల కొరకు నిరంతరం పనిచేస్తుందన్నారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పార్టీ అధికారం లోకి రావడానికి పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించి, డిప్యూటీ సీఎం అయ్యారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో పవన్ కళ్యాణ్ దేశంలోనే కీలక నేతగా ఎదుగు తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విష్ణు, సిద్దు, పిట్టల సుధాకర్, ఆవుల సాగర్, మేకల సుధాకర్ రంజిత్ 45వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి పిట్టల సంధ్యారాణి, 6వ కార్పొరేటర్ అభ్యర్థి హర్షిత రమేష్, రాకేష్, రఫీ,సురేందర్ రెడ్డి, సాయికుమార్ జనసేన నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ పై రైతులు అవగాహన పెంచుకోవాలి

**చెన్నూరు డివిజన్**
**సహాయ వ్యవసాయ సంచాలకులు బానోతు ప్రసాద్**



**జనోదయ, మందమర్రి మార్చి 14:**

రైతులందరూ కలసి ఏర్పాటు చేసుకునే ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్పిఓ) సంస్థ పై రైతులు అవగాహన పెంచుకోవాలని చెన్నూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ కోరారు. మండలం లోని బొక్కలగుట్ట గ్రామ రైతు వేదికలో గ్రామ రైతులకు ఎఫ్పిఓ పై నిర్వహించిన అవగాహన కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ )ఆధ్వర్యంలో వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయాన్ని పెంచి, మార్కెట్ లో మంచి ధరలు పొందడం కోసం ప్రభుత్వం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ పిఒ)లను ప్రోత్సహిస్తోందన్నారు. రైతులు ఒక సమూహంగా పనిచేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకు కొనుగోలు చేయవచ్చన్నారు.రైతులు తమ పంటలను సమూహంగా మార్కెట్‌లో విక్రయించడం ద్వారా మంచి ధర పొందే అవకాశం ఉంటుందని దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎఫ్పిఓ లకు ఆర్థిక సహాయం, శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి కిరణ్మయి, వ్యవసాయ విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, సైండ్ల కనకరాజు, ఉద్యానవన శాఖ అధికారి కళ్యాణి, ఆయిల్ పాం ఎగ్జిక్యూటీవ్ అజయ్, సర్పంచ్ మాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### 76 సంవత్సరాల స్వతంత్ర పరిపాలనలో

# దళితులకు ఒరిగిందేమీ లేదు

**మార్చి 20న**
**దళిత హక్కుల పోరాట సమితి**
**హనుమకొండ జిల్లా రెండవ మహాసభ**




**జనోదయ, హనుమకొండ, మార్చి 14:**

దళిత హక్కుల పోరాట సమితిజిల్లా మహాసభలను పురస్కరించుకొని ధర్మసాగర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు నిమ్మల మనోహర్, రొంటాల దేవా మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు కల్పించవలసిన ప్రభుత్వాలు ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్లు కల్పించుటకు తగిన చర్యలు తీసుకోవడం లేదు రిజర్వేషన్‌లో ఉనికికే ప్రమాదం పొంచి ఉంది రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు దళితుల అభివృద్ధికి చట్టబద్ధంగా కేటాయించవలసిన 20 శాతం నిధులను ఏనాడు కేటాయించలేదన్నారు. కేటాయించిన కొద్దిపాటి నిధులను కూడా దళితుల అభివృద్ధికి ఉపయోగించకుండా ఇతర పథకాలకు దారి మళ్లించుతున్నారని ఆరోపించారు. స్వాతంత్రం వచ్చి దాదాపు 76 సంవత్సరాల స్వతంత్ర పరిపాలనలో దళితులకు ఒరిగిందేమీ లేదన్నారు. నేటికీ దళితులపై జరుగుతున్నటువంటి దాడులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్ట లేక పోతున్నాయన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు లపై స్టేషన్ బేలు ఇవ్వకుండా ఈ కేసు లను చట్ట పరంగా కఠినంగా శిక్షలు విధిస్తే గాని, దళితులపై జరుగుతున్న దాడులు పునరావృతం కాకుండా పోతా యని వారు డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా అప్పటికి మేనిఫెస్టోలో పెట్టినటువంటి అంబేద్కర్ హస్తం కింద దళితులకు 12 లక్షల రూపాయలు నేటికీ ఇవ్వలేదన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లలో ఇండ్లు లేని పేదలు దళితులే దాదాపు నూటికి 80 శాతం ఉన్నారు. కాబట్టి ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత దళితులకు ఇవ్వాలన్నారు.మార్చి 20 తారీకు జరగబోయే దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా రెండవ మహాసభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్ర బిక్షపతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేస్. దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా నిర్మాణ బాధ్యతలు కొట్టపాక రవి. సిపి ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి. హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ధర్మసాగర్ మండల కార్యదర్శి రాజారపు రత్నం. సిపిఐ మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్. గ్రామ కార్యదర్శి చిలుక బాబు. సిపిఐ సీనియర్ నాయకులు దోకి రాజయ్య. వల్లపు సారయ్య. వల్లపు వెంకన్న. రాసమల్ల కుమార్. బొడిగె కమలాకర్. తదితరులు పాల్గొన్నారు.

# గొప్పశ్రామిక విప్లవవాది కారల్ మార్క్స్

**-ప్రపంచ మేధావి**
**శ్రామిక మిగులు శ్రమను గుర్తించిన గొప్ప వ్యక్తి**
**-సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా**




**వరంగల్ జిల్లా ప్రతినిధి (జనోదయ)**

కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా సిపిఐ కార్యాలయం తమ్మెర భవన్ శివ నగర్ లో కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ.. కారల్ మార్క్స్ ఒక గొప్ప మానవ విజ్ఞాన శాస్త్రవేత్త అన్నింటి కంటే ముఖ్యంగా ఆయన గొప్పశ్రామిక విప్లవవాది ఆయన మానవ సమాజ విముక్తి పథ నిర్దేశకుడు 19వ శతాబ్దం మానవ సమాజానికి సమర్పించిన ఒక మహోన్నత మానవుడు పెట్టుబడిదారీ సమాజాన్ని కూల్చివేయడానికి ఆధునిక శ్రామిక వర్గ విముక్తికి తోడ్పడడమే ఆయన జీవిత పరమోద్దేశం ఆయన పేరు యుగయుగాల దాకా అమరంగా ఉంటుంది. అలాగే ఆ కృషి కూడా చిరస్థాయిగా ఉంటుంది అదనపు విలువ ఆవిష్కారం తో సమకాలిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్ని శాసించే ప్రత్యేక గతి నియమాన్ని మార్క్స్ కనుగొనడంలో చరిత్రలో మొదటి సారిగా వెలుగు ప్రసరించబడింది.కామ్రేడ్ మార్క్స్ పరిశోధన జరిపిన ప్రతి రంగంలోనూ తాత్విక చారిత్రక ఆర్థిక సామాజిక వర్గ పోరాట రంగాల్లోని ప్రతి ఒక్క విషయంపై కూడా ఆయన స్వతంత్రమైన లోతైన ఆవిష్కరణ చేశాడని అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి మాట్లాడుతూ.. మార్క్సిజము అంటే ప్రకృతి మానవ సమాజాల అభివృద్ధిని నియంత్రించే నియమాల విజ్ఞాన శాస్త్రం దోపిడికి పీడనకు గురయ్యే ప్రజారాశుల విప్లవ శాస్త్రం కార్మిక కమ్యూనిస్టు ఉద్యమాలు నేడు అనేక బలహీనతలతో వెనుకంజలో ఉండడానికి గల కారణాలని మార్క్సిజము దృష్టి కోణం నుండి సమీక్షించుకొని శ్రామిక వర్గ అధికారం కోసం ప్రజలను సోషలిస్టు చైతన్యవంతం చేయడమే నేటి ప్రధాన కర్తవ్యం కమ్యూనిస్ట్ సిద్ధాంత వేత్త కారల్ మార్క్స్ కు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సంఘీ ఏలం ధర్, జిల్లా సమితి సభ్యులు లాదెళ్ల శర త్, తాళ్లపల్లి జాన్ పాల్, రాజేందర్, చెలుకుల రాజు, నాయకులు నల్ల తీగల కుమార్, జట్టి విజయలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

### మండలంలో

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



**జనోదయ : మందమర్రి మార్చి 14:**
పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మండలంలో శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా మందమర్రిలో సింగరేణి, కార్మెల్,తవక్కల్ పాఠశాలల్లో, రామకృష్ణాపూర్‌లోని తవక్కల్, బిఎల్ అల్ఫోన్సా కాన్వెంట్ పాఠశా లల్లో మొత్తం 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు పరీక్షకు 897 మంది విద్యార్థులకు గాను 894 మంది విద్యార్థులు హాజరు కాగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలను దృష్టిలో పెట్టుకొని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టగా ముందు జాగ్రత్త చర్యల్లో బాగంగా పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచారు.

### తెలంగాణ రాష్ట్ర గవర్నమెంట్
### రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

## నూతన అధ్యక్షుడుగా పేరి వెంకట్ రెడ్డి



**జనోదయ శేరిలింగంపల్లి :** మియాపూర్ మయూరి నగర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉమ్మడి పాలమూరు జిల్లా ఐక్యవేదిక ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పేరి వెంకట్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమం ఐక్యవేదిక తాత్కాలిక అధ్యక్షులు కె. కోటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని పేరి వెంకట్ రెడ్డి ఉపాధ్యాయ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర స్థాయి బాధ్యతలు చేపట్టడం గర్వకారణమని తెలిపారు. ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఇదే కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి మియాపూర్ ఎం.ఎ.నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్న శర్మందా అనే వ్యక్తి గత నెలలో రోడ్డు ప్రమాదంలో మరణించగా, అతని కుటుంబానికి ఉమ్మడి పాలమూరు జిల్లా ఐక్యవేదిక తరఫున రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఐక్యవేదిక నాయకులు, సభ్యులు,మయూరి నగర్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




సీనియర్ జర్నలిస్ట్ మానసాని కృష్ణారెడ్డి
సంపాదకత్వం,సారథ్యంలో వస్తోన్న నిఖార్సయిన ప్రింటింగ్ పత్రిక

అవసరమైన వార్తలు
అర్థవంతమైన విశ్లేషణలు
అర్థమయ్యే సంపాదకీయాలు
అన్నివర్గాల అంతరంగాలు
చదవండి..
చదివించండి
తెలుగు దినపత్రిక
8074124190
9618616110
janodaya
జనోదయ

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190


# రాజకీయాలకతీతంగా అభివృద్ధి

**నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ముందుంచుతాం**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేత**






**జనోదయ, హనుమకొండ, మార్చి 14:**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్ లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని ముందువరుసలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. 61వ డివిజన్‌లో రూ.13 లక్షలతో సిద్ధార్థ నగర్ కమ్యూనిటీ హాల్‌లో డైనింగ్ హాల్ నిర్మాణం, డాక్టర్స్ కాలనీలో రూ.65 లక్షలతో పార్క్ ప్రహరీ గోడ నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే 57వ డివిజన్‌లో అశోక కాలనీ, గోకుల్ నగర్ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, ఇంజనీర్స్ కాలనీ మరియు ఎస్ పి ఆర్ పాఠశాల ఆవరణలో బ్రిడ్జి నిర్మాణ పనులకు కలిపి మొత్తం రూ. 2.14 కోట్ల వ్యయంతో శంకుస్థాపనలు చేశా రు.ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే, ప్రారంభించిన ప్రతి పనిని నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...భవిష్యత్తులో వరద సమస్యలు సంభవించవు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయితే వరద సమస్యలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని చెప్పారు. మంచినీటి సరఫరా మెరుగుపరచడానికి సుమారు రూ.500 కోట్లతో పైపులైన్ల ఏర్పాటు చేపడుతున్నా మని తెలిపారు. గతంలో నిర్మించిన పాత నీటి ట్యాంకులను తొలగించి ఆధునిక సౌకర్యాలతో కొత్త ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు.99 రోజుల ప్రణాళికలో భాగంగా రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి ప్రతి రోజు ప్రజల మధ్యలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం అవుతాయని, అభివృద్ధిలో ఎటువంటి బేధాలు ఉండవని స్పష్టం చేశారు. కాలనీల్లో ఉన్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని అవసరాన్ని బట్టి ఏ బి సి కేటగిరీలలో నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఏ పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఉన్నా అభివృద్ధి పనులను ఆపే ప్రశ్నే లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**ముస్లింలకు రంజాన్ కిట్స్ అందజేత..**

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదర సోదరీమణులకు అందజేస్తున్న "రంజాన్ తోఫా" కిట్స్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 1700 మంది లబ్ధిదారులకు ఈ కిట్స్ అందనున్నట్లు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులకు సహాయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని అన్నారు.రంజన్ మాసంలో నియోజక వర్గంలో 7 ప్రధాన మస్జిద్ లకు 1 లక్ష చొప్పున 7 లక్షలను మంజూరు చేశామని వెల్లడించారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, పార్టీ నాయకులు, అధికారులు,ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## మాజీ డీజీపీ హెచ్ జె దొర అంతక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ జిల్లా ప్రతినిధి (జనోదయ) మార్చి 14**

హైదరాబాద్ జూబ్లీహిల్స్ మహా ప్రస్థానం నందు మాజీ డీజీపీ హెచ్ జె దొర అంతక్రియలలో పాల్గొని భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు. ఈ నివాళులర్పించే కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు, ప్రముఖులు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

## వినతికి కేంద్రం స్పందన

**ధాన్యం రవాణాకు రైల్వే రేక్స్ కేటాయింపు**



**జనోదయ, హనుమకొండ, మార్చి 14:** తెలంగాణలో ధాన్యం (ప్యాడి), పత్తి రవాణాకు అవసరమైన రైల్వే రేక్స్‌ను సమృద్ధిగా కేటాయించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు వరంగల్ ఎంపీ డా. కడియం కావ్యకు లేఖ ద్వారా "రైల్వే రేక్స్"ను సమృద్ధిగా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభలో రూల్ 377 కింద 2025 డిసెంబర్ 9న వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ప్రస్తావించిన అంశానికి స్పందిస్తూ మార్చి 6న మంత్రి లేఖ రాశారు. తెలంగాణలో ధాన్యం, పత్తి వంటి వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు అదనపు " రైల్వే రేక్స్" అందించాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు. ఈ నేపథ్యంలో మంత్రి స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వాలు, భారత ఆహార సంస్థ సమర్పించే అవసరాల ఆధారంగా ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రేకులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ అవసరాలు, రైల్వే బోగీల లభ్యత, రైల్వే మార్గాల సామర్థ్యం, నిర్వహణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కేటాయింపులు జరుగుతాయని వివరించారు.

## ఆజంజాహి మిల్లు కార్మికులకు తక్షణమే ఇంటి స్థలాలు కేటాయించాలి

**-ఇంటి స్థలాలు కేటాయించే వరకు దశలవారీగా ఉద్యమాలకు సిద్ధం కావాలి**

**వరంగల్ జిల్లా ప్రతినిధి (జనోదయ) మార్చి 14**

318 మంది కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే మిల్లు స్థలంలో ఇంటి నిర్మాణానికి సంబంధించిన 200గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తూ.. శనివారం శివనగర్ లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో వామపక్ష పార్టీల జాయింట్ సమావేశం ఎన్ వి ఆర్ ఎస్ యూనియన్ అధ్యక్షుడు ఇనుముల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దశల వారి ఆందోళన కార్యక్రమాలకు నిలుపునివ్వటం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా, సిపిఎం పార్టీ నాయకులు సింగారపు బాబు, రత్నమాల, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, నున్న అప్పారావు, ఎం సి పి ఐ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, ఎం వి ఆర్ ఎస్ యూనియన్ కార్యదర్శి ఆర్యకృష్ణలు మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాల కాలంగా మిల్లు కార్మికుల ఇంటి స్థలాల విషయంలో పాలకవర్గాల తోటి నిరంతరం యుద్ధం చేయాల్సి వస్తుందని, ఆజాంజాహి మిల్లు కార్మికులకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయడంలో స్థానిక ఎమ్మెల్యే తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు తీవ్రమైనటువంటి నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని, వెంటనే నిర్లక్ష్య వైఖరిని విడనాడి కార్మికుల ప్రయోజనాల కోసం సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 2 గజాల స్థలాన్ని కేటాయించాలని ఈ సందర్భంగా 16వ తారీకు నుంచి జరగబోతున్న అసెంబ్లీలో మిల్లు కార్మికుల విషయాన్ని ఏజెండా మీదకి తీసుకురావడానికి స్థానిక ప్రజాప్రతినిధులను కలవాలని కార్మికుల గోడును వెల్లబోసుకోవాలని వామ పక్ష పార్టీలు తీర్మానం చేయడం జరిగింది. రాష్ట్ర సెంటర్లో ఉన్నటువంటి ప్రతిపక్ష పార్టీలను వామపక్ష పార్టీల నాయకులను కలిసి బిల్లు కార్మికుల విషయాన్ని చర్చించాలని దీనికి ఒక కార్యరూపం దాల్చాలని అన్నారు. అందుకు అజం జహి కార్మిక వర్గం కూడా ఈ పోరాటంలో ఉండాలని సూచించారు. ఆనాడు ఆజా జహీ మిల్లు పోరాటం రాజకీయ నిరుద్యోగులకు ఒక ఉపాధిని కల్పించిందని ఆ ఉపాధితో లబ్ది పొందినటువంటి ప్రజాప్రతినిదులు నేడు కార్మిక వర్గం పడుతున్నా ఇబ్బందులని పట్టించుకోవడం లేదని వారి ముఖాన కూడా చూసిన పరిస్థితి దరిదాపుల్లో లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆరూరి కుమార్, దండు లక్ష్మణ్ తది తరులు పాల్గొన్నారు.




### ఆడపడుచు వివాహానికి

## సర్పంచ్ పెళ్లి కానుక



**జనోదయ, మందమర్రి మార్చి 14:**

నిరుపేద ఆడపడుచు వివాహానికి వివాహ కానుక అందించి అండగా నిలిచారు మండలం లోని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ సెగ్గం వెంకటేష్. శనివారం గ్రామంలో జరిగిన పాదం రాజయ్య కూతురు రమ్య వివాహానికి హాజరై నూతన వధూవరుల ను ఆశీర్వ దించారు. ఈ సందర్భంగా 5 వేలు రూపాయలు పెళ్ళి కానుక అందచేశారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామం లోని ఆడపడుచుల వివాహానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ కానుక అందచేసి మాట నిలబెట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుద్దుల కిష్టయ్య, మాజి ఉపసర్పంచ్ రాజయ్య పాల్గొన్నారు.

# డిప్యూటీ వార్డెన్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సస్పెండ్

**కలెక్టర్ పిఓ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్, నర్సింగ్ సిబ్బందిలకు సైతం షోకాజ్..**

**పర్వతగిరి గిరిజన గురుకుల పాఠశాలలో ఘటన..**

**ఆకస్మిక తనిఖీ చేసి ఆదేశాలిచ్చిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**జనోదయ, వరంగల్, మార్చి 14:**

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన పర్వతగిరి గిరిజన బాలికల గురుకుల డిప్యూటీ వార్డెన్ సంధ్యా రాణి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శారద లను సస్పెండ్ చేయడానికి ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత డీసీఓను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టర్ శనివారం పర్వతగిరి మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, రికార్డు గది, భోజనశాల, వంట గది, స్టోర్ రూమ్‌లు, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. పరిశీలనలో తరగతి గదులు, వంటగది అపరిశుభ్రంగా ఉండడం, గమనించిన కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ఆహార పదార్థాల నిల్వ, పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

**విద్య, వైద్య సిబ్బందికి సైతం షోకాజ్..**

అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళిక అమలులో నిర్లక్ష్యం వహించడం, విద్యార్థుల విద్యా కార్యకలాపాల పట్ల సరైన పర్యవేక్షణ లేకపోవడంపై కలెక్టర్ పీఓ అపర్ణ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రేవతిలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే విద్యార్థులకు అందించే ఔషధాల నిర్వహణలో బాధ్యత వహిస్తున్న బీజీఎన్ఎం (నర్సింగ్ సిబ్బంది) కు సరైన అవగాహన లేకపోవడం, విధుల్లో అలసత్వం ప్రదర్శించడం పట్ల కలెక్టర్ షో కాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పదవ తరగతి పరీక్షలను బాగా రాయాలని ప్రోత్సహించారు. పదవ తరగతిలో మంచి మార్కులు



సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు విహారయాత్రకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను పరిశీలించి విద్యార్థులు చేసిన ఫిర్యాదులను అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, విద్యా పురోగతికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట జిల్లా బిసి సంక్షేమ అధికారి పుష్పలత తదితరులు ఉన్నారు.

## ఢిల్లీకి రామగుండం మహిళా స్వశక్తి గ్రూప్ సభ్యురాలు



**జనోదయ, గోదావరిఖని, మార్చ్ 14:**

రామగుండం స్వశక్తి మహిళ బూర్గుల అనిత ఈ నెల 13 న న్యూ ఢిల్లీ భారత మండపంలో నిర్వహించిన అమృత్ మిత్ర మహోత్సవ్‌లో పాల్గొన్నారు. యాభయ్ తొమ్మిదవ డివిజన్ మార్గదర్శి స్లమ్ సమాఖ్యలో భాగమైన శ్రీ సరస్వతి మహిళా పొదుపు సంఘం సభ్యురాలు బూర్గుల అనిత అమృత్ మిత్రగా ఎంపికై గత కొంత కాలంగా దుర్గానగర్ పార్క్‌లో పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్‌ల నుండి ఐదుగురిని నామినేట్ చేయగా అందులో రామగుండం నగరపాలక సంస్థ నుండి అనితకు అవకాశం లభించింది.

## మున్సిపల్ కార్మికులకు చీరలు, పంచలు పంపిణీ



**జనోదయ, గోదావరిఖని, మార్చ్, 14:**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 51 డివిజన్ స్వతంత్రచౌక్‌లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్, మనాలి ఠాగూర్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్మికులకు చీరలు మరియు కార్మికులకు లుంగీ పంచలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య పాల్గొని కేకును కట్ చేసి అనంతరం వారు చేతుల మీదుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్మికు రాళ్లకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బులియన్ మార్చంట్ అధ్యక్షులు గుగ్గిల రవీందర్, సునీల్ జాదవ్, ప్రసాద్ ,తో పాటు డివిజన్ కాంగ్రెస్ నాయకులు వై సతీష్, జి అశోక్, కే సతీష్, సిహెచ్. సత్యం జి.బాబు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు సింగరేణి ప్రోత్సాహం

**ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ**

**జనోదయ : మందమర్రి మార్చి 14:**

మహిళలను ప్రోత్సహించడంలో సింగరేణి సంస్థ ముందుంటుందని సింగరేణి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ స్పష్టం చేశారు. పట్టణంలోని ఇల్లందు క్లబ్ లో శనివారం సింగరేణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఏరియా సేవా అధ్యక్షులు ఎన్ శ్రీవాణి రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ, గౌరవ అతిథులుగా సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, డిజిఎం పర్సనల్ అశోక్, సిఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు రమేష్, ఇతర అతిథులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి, వేడుకలు ప్రారంభించారు. అనంతరం ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్ శ్రీవాణి రాధాకృష్ణ మాట్లాడుతూ, అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తే, మహిళలు అన్ని రంగాల్లో




మగవారికి దీటుగా రాణిస్తారని తెలిపారు. నేడు మహిళలు వివిధ రంగాల్లో సత్తా చాటడం తోపాటు కొన్ని రంగాలను శాసిస్తున్నారని తెలిపారు. అనంతరం ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ, దేశంలో అత్యున్నత పదవి నుండి నేడు అన్ని రంగాల్లో మహిళలు సత్తా చాటుతున్నారని తెలిపారు. సింగరేణిలో సైతం మహిళలు అండర్ గ్రౌండ్‌తో పాటు అన్ని విభాగాల్లో విధులు నిర్వహిస్తూ రాణిస్తున్నారని, వారికి కావలసిన కనీస వసతులు కల్పించడం తో పాటు పని ప్రదేశాల్లో వారి రక్షణ కోసం తగిన చర్యలు తీసుకొని, వారిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన మహిళలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా పోష్ యాక్ట్ చట్టంపై అవగాహన కోసం నిర్వహించిన పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివై ఫైనాన్స్ మేనేజర్ సరిత, లేడీస్ క్లబ్ కోశాధికారి కవిత, లేడీస్ క్లబ్ సభ్యులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ అసిస్టెంట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**జనోదయ, మందమర్రి మార్చి 14:**

ఏరియాలోని సిఈఆర్ క్లబ్ స్విమ్మింగ్ పూల్‌లో పనిచేయుటకు స్విమ్మింగ్ అసిస్టెంట్ కొరకు సింగరేణి ఉద్యోగుల నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని ఏరియా డిజిఎం పర్సనల్ సిహెచ్ అశోక్ శనివారం ప్రకటనలో తెలిపారు. స్విమ్మింగ్ నేషనల్ లైవ్ సేవింగ్ సర్టిఫికెట్ తోపాటు సింగరేణిలో ఐదు సంవత్సరాలు కలిగిన సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్ లు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, అర్హత గల అభ్యర్థులు మార్చి 18 లోపు తమ దరఖాస్తులను జిఎం కార్యాలయంలోని పర్సనల్ కార్యాలయం నందు అందజేయాలని సూచించారు.

# జస్టిస్ రమణ మీకిది తగునా?



## వివాదాస్పదంగా మారిన మాజీ సీజేఐ వ్యవహారం

» రాజకీయ పార్టీ నేత అభినందన సభలో పాల్గొనడం ఏంటి?

» కష్టపడే నేతలకు పదవులు ఇవ్వాలని ఓ రాజకీయ పార్టీ అధినేతకు సలహాలు ఇవ్వడం ఏంటి?

- తెలుగుదేశం పార్టీతో ఉన్న లింకేంటి?
- విమర్శలకు తావిస్తోన్న జస్టిస్ ఎన్వీ రమణ తీరు

**భారత దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టుకు 48వ చీఫ్ జస్టిస్‌గా తెలుగువారైన జస్టిస్ ఎన్వీ రమణ పనిచేసిన విషయం తెల్సిందే.దేశ అత్యున్నత న్యాయస్థానానికి సీజేఐగా ఒక తెలుగువారు పనిచేయడం తెలుగువారందరికీ గౌరవంగా భావించాం. అయితే సీజేఐగా జస్టిస్ రమణ పదవీకాలం ముగిసిన అనంతరం ఆయన కొన్ని సభలు సమావేశాలకు హాజరవుతున్నారు. ముఖ్యంగా అమరావతి రైతుల ఉద్యమాలు,తెలుగు భాష ఉద్ధరణ వంటి అంశాల విషయాల్లో నిర్వహిస్తున్న సభలకు మాజీ సీజేఐ జస్టిస్ రమణ హాజరవుతూ పలు అంశాల మీద మాట్లాడుతున్న తీరు వివాదాలకు దారితీస్తున్న విషయం తెల్సిందే.తాజాగా జస్టిస్ రమణ తెలుగుదేశం పార్టీ నిర్వహించిన కార్యక్రమానికి హాజరై చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.**



కె.ఆర్ ఉన్నమాట

**భారత దేశ** అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టుకు 48వ చీఫ్ జస్టిస్‌గా తెలుగువారైన జస్టిస్ ఎన్వీ రమణ పనిచేసిన విషయం తెల్సిందే.దేశ అత్యున్నత న్యాయస్థానానికి సీజేఐగా ఒక తెలుగు వారు పనిచేయడం తెలుగువారందరికీ గౌరవంగా భావించాం.అయితే సీజేఐగా జస్టిస్ రమణ పదవీకాలం ముగిసిన అనంతరం ఆయన కొన్ని సభలు సమావేశాలకు హాజరవుతున్నారు. ముఖ్యంగా అమరావతి రైతుల ఉద్యమాలు,తెలుగు భాష ఉద్ధరణ వంటి అంశాల విషయాల్లో నిర్వహిస్తున్న సభలకు మాజీ సీజేఐ జస్టిస్ రమణ హాజరవుతూ పలు అంశాల మీద మాట్లాడుతున్న తీరు వివాదాలకు దారితీస్తున్న విషయం తెల్సిందే. తాజాగా జస్టిస్ రమణ తెలుగుదేశం పార్టీ నేతలు నిర్వహించిన కార్యక్రమానికి హాజరై చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.వాస్తవానికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టుతోపాటు రాష్ట్ర హైకోర్టు జస్టిస్‌లు,శాసనసభా పతులు, రాష్ట్రపతులు,గవర్నర్‌లు,ఎన్నికల కమిషనర్లు వంటి పదవులపై దేశ పౌరులకు అపార గౌరవం ఉంటుంది.వారు పదవుల్లో ఉన్నప్పుడు..పదవీ విరమణ అనంతరం వారి ప్రభావం ప్రజలపై తప్పక ఉంటుంది.ఒక్కసారి ఇలాంటి పదవులను అలంకరించిన తర్వాత రాగద్వేషాలకు అతీతంగా, నిజాయితీగా,నిష్పక్షపాతంగా ఉంటూ ప్రజల్లో ఆ స్థానానికి గౌరవాన్ని పెంపొందిస్తుంటారు.అయితే ఈ పదవుల విరమణ అనంతరం కూడా వారు తాము అధిరోహించిన అత్యున్నత స్థానాల గౌరవాన్ని కాపాడటం అనేది వారి బాధ్యతగా గుర్తిస్తారు.అయితే మాజీ సీజేఐ జస్టిస్ రమణ పదవీ విరమణ అనంతరం ఆయన హాజరవుతున్న కార్యక్రమాలు,చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా విస్మయానికి గురిచేస్తున్నాయి.అమరావతి రైతుల విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు గతంలో వివాదాస్పదంగా మారిన విషయం తెల్సిందే.ఓ మాజీ సీఎంని టార్గెట్‌గా చేసుకుని ఆయన మాట్లాడిన తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి.తాజాగా తెలుగుదేశం నాయకుడు ఎన్ఆర్ కోమటి జయరాంకు సంబంధించిన కార్యక్రమంలో జస్టిస్ ఎన్వీ రమణ హాజరయ్యారు.ఇది ఓ రాజకీయ పార్టీకి సంబంధించి కార్యక్రమం.ఈ కార్యక్రమానికి ఓ మాజీ సీజేఐ హాజరవ్వడం ఆశ్చర్యకరంగా ఉంది. నార్త్ అమెరికాలో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా కోమటి జయరాం అనే ఎన్ఆర్ఐని చంద్రబాబు సర్కార్ నియమించింది.ఈ కోమటి జయరాం గడిచిన ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం అధికారంలోకి రావడానికి అమెరికా నుంచి వచ్చి ఏపీలో మకాం వేసి పనిచేసిన విషయం తెల్సిందే. ఆ సందర్భంగా కోమటి జయరాం ఎన్ఆర్ఐల సమావేశంలో మాట్లాడుతూ ఓటర్లను వెదవలుగా అభివర్ణించిన వీడియో ఒకటి బయటకు వచ్చి సంచలనం సృష్టించిన విషయం తెల్సిందే. అవసరమైతే ఓటర్ల అవసరాలను గుర్తించి వారిని డబ్బుతో కొనేయాలని కోమటి జయరాం తోటి ఎన్ఆర్ఐలకు హితభోద చేసిన విషయం చూశాం. అలాంటి కరుడుగట్టిన పార్టీ నేత కోమటి జయరాంకు చంద్రబాబు సర్కార్ నార్త్ అమెరికా ఏపీ ప్రతినిధిగా పదవిని కట్టబెట్టింది.ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభకు దేశ అత్యున్నత పదవి సీజేఐగా పనిచేసినటువంటి జస్టిస్ ఎన్వీ రమణ హాజరవడం పూర్తిగా అభ్యంతరకరమే.పైగా ఆ సభలో జస్టిస్ రమణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి బాగా కష్టపడిన కోమటి జయరాం వంటి కార్యకర్తలు,నేతలను చంద్రబాబు గుర్తించి పదవులు ఇవ్వాలని బహిరంగంగా సూచించారు.ఓ రాజకీయ పార్టీ అంతర్గత వ్యవహారాలను ఓ మాజీ చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన వ్యక్తి బహిరంగ వేదికల మీద మాట్లాడం వింతగా ఉంది.దేశ అత్యున్నత న్యాయస్థానానికి అత్యుతన్న పదవి సీజేఐ హోదాలో పనిచేసిన వ్యక్తి ఓ రాజకీయ పార్టీ నేతలకు పదవులు ఇవ్వండని బహిరంగంగా రికమండ్ చేయడం ఏంటి? అసలు జస్టిస్ రమణకు తెలుగుదేశం పార్టీకి సంబంధం ఏంటి? ఆయన పదేపదే ఇలా ఓ కుల సమావేశాలు,రాజకీయ పార్టీ సమావేశాల్లో పాల్గొనడం ఏంటనే ప్రశ్న సర్వత్రా వ్యక్తమవుతోంది.ఆయన దేశ అత్యున్నత న్యాయస్థానానికి అత్యున్నత హోదాలో కూర్చున్న విషయంలో ఏదైనా ఎవరికైనా విశ్వాసాన్ని చూపెడుతున్నారా అనే సందేహాలు వస్తున్నాయి. ఎందుకంటే కోమటి జయరాం అభినందన సభలో ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో మనకు సాయం చేసిన వారిని గుర్తించుకోవాలని,వారిని కాపాడుకోవాలని వ్యాఖ్యానించారు.ఇప్పుడు దేశం అత్యున్నత హోదా తనకు దక్కడంలో ఎవరు సాయం చేశారో..ఎవరిని గుర్తించుకుంటున్నారో తెలియదు కానీ జస్టిస్ రమణ మాత్రం తనలో ఉన్న విశ్వాసాన్ని, ఆవేదనను పదేపదే వెళ్ళగక్కుతూనే ఉన్నారు.అసలు ఓ పార్టీ నేత సభకు హాజరవ్వడమే అనైతికం కాగా ఓ పార్టీనేతకు పదవి ఇవ్వాలని ఓ రాజకీయ పార్టీ అధినేతకు బహిరంగంగా సూచించడం ఏంటి? అనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.పదవిలో ఉన్న సమయం.. పదవీ విరమణ అనంతర సమయంలో కూడా ఎంతో హుందాగా వ్యవహరించి రాగద్వేషాలకు అతీతంగా ఉండాల్సిన జస్టిస్ రమణ ఇలా ఓ ప్రాంతీయ పార్టీకి సలహాలిచ్చే స్థాయిలోకి వెళ్ళడం నిజంగా విచారకరం.ఎందరో మహానుభావులు దేశ అత్యున్నత హోదాలను అధిరోహించి వాటి గౌరవాన్ని కాపాడిన చరిత్రలు ఎన్నో చదువుకున్నాం.కానీ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టుకు సీజేఐగా పనిచేసిన జస్టిస్ రమణ ఎందుకో ఆ గౌరవాన్ని నిలపడంలో విమర్శలపాలవడం బాధాకరం.పదవీ విరమణ అనంతరం దేశ అత్యున్నత స్థానాలను అధిరోహించిన వారు చేసే వ్యాఖ్యలు,వారి వ్యక్తిగత జీవిత వ్యవహారం రాన్ని కూడా ప్రజలు గమనిస్తూనే ఉంటారు.పదవీ విరమణ అనంతర నడకతీరు గత పనితీరుకు దర్పణంగా ఉంటుంది.ఇప్పుడు ఏ చిన్న పొరపాటు జరిగినా గత పనితీరుపై అనుమానాలు ముసురుకుంటాయి.ఇప్పుడు జస్టిస్ రమణ ఓ రాజకీయ పార్టీకి ఓ నేతకు పదవులు ఇవ్వాలని సలహాలిస్తున్నారంటే గతంలో ఆయన వివిధ సందర్భాలో ఇచ్చిన తీర్పులు సంబంధిత రాజకీయ పార్టీకి ఉన్న లింకులు ఏంటనే విషయాలమీద చర్చ వస్తుంది. నిజానికి అనేక వివాదాస్పద అంశాల మీద ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తనకు అనుకూలంగా తీర్పులు రాబట్టుకున్నారనే విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి.కోర్టుల్లో స్టేలు తెచ్చుకోవడంలో ఆయనను మించిన వారు లేరనే వారంటారు.సర్గీయ నందమూరి తారకరామారావు నుంచి పార్టీ గుర్తును దక్కించుకునే దగ్గర నుంచి లిక్కర్ నిషేధ వ్యవహారం వరకూ అనేక సందర్భాల్లో విజయవంతంగా చంద్రబాబు నాయుడు బయటపడగలిగారు.ఈ విషయాల మీద ఇప్పటికీ అనేక ఆరోపణలు ఉన్నాయి.ఇప్పుడు మాజీ సీజేఐ జస్టిస్ రమణ నోటినుంచి వస్తున్న వ్యాఖ్యలకు ఈ ఆరోపణలకు లింకులు ఉన్నాయా అనే అనుమానాలు సర్వత్రా బలపడేలా ఉన్నాయి.ఏది ఏమైనప్పటికీ జస్టిస్ రమణ తీరు వివాదాస్పదంగా మారుతోంది.చంద్రబాబు నాయుడు స్కిల్‌స్కాంలో అరెస్ట్ అయిన సందర్భంలో ఇప్పటి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎన్ఆర్ఐ కోమటి జయరాం తన దగ్గరకు వచ్చారని చంద్రబాబు నాయుడు అరెస్ట్ విషయంతో పాటు అమరావతి రైతుల విషయంలో ఏదో ఒకటి చేయాలని అడిగారని స్వయంగా జస్టిస్ రమణే చెప్పడం గమనార్హం.అంటే ఒకపార్టీ నేత అరెస్ట్ అయితే ఆ పార్టీ నేతలు ఓ మాజీ సీజేఐతో సంప్రదింపులు జరపవచ్చా? ఒక్కసారి దేశ అత్యున్నత పదవిలో కూర్చున్న తర్వాత సామాన్యుడైనా..రాజు విషయంలో అయినా రాగద్వేషాలు, కులాలకతీతంగా నిష్పక్షపాతంగా ఉండాల్సిన ఓ న్యాయమూర్తే ఓ రాజకీయ పార్టీ నేతలు తనని కలుసుకునే అవకాశం ఇవ్వడం ఏం ధర్మమో జస్టిస్ రమణనే చెప్పాలి.స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు నాయుడు నిందితుడు.ఓ నిందితుడి తరపున పార్టీనేతలు సాయం కోసం సంప్రదించాలని వస్తే తిరస్కరించాల్సిన సందర్భంలో వారితో నిందితుడు చంద్రబాబు నాయుడిని ఎలా విడిపించాలని ఆలోచన చేయడం ఏ రకమైన నిష్పక్షపాత న్యాయమో మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణకే తెలియాలి.ఏది ఏమైనప్పటికీ జస్టిస్ రమణ తీరు వివాదాస్పదంగా ఉంది.దేశ అత్యున్నత న్యాయస్థానానికి అత్యున్నత హోదాలో పనిచేసిన వ్యక్తి ఇలా ఓ ప్రాంతీయ పార్టీకి సలహాలిచ్చే స్థాయిలోకి దిగజారడం విచారకరం..ఇలాంటి చర్యలతో ఆ పదవుల గౌరవానికి భంగం కల్గించేవే.ఇప్పటికైనా జస్టిస్ ఎన్వీ రమణ తను హాజరయ్యే కార్యక్రమాలు, చేసే వ్యాఖ్యానాల విషయంలో నియంత్రణ ఉంటే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

....................

మానసాని కృష్ణారెడ్డి
9618616110

## గ్యాస్ బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు

**గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు**

**కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో ఇబ్బంది ఉంది**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, మార్చి14:** గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన సమస్యలపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అయితే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంత ఇబ్బంది ఉన్నట్లు వెల్లడించారు.శనివారం ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాను పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 811 ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.3 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో 11 లక్షలు ఉజ్వల పథకం, 28 లక్షలు దీపం పథకం కింద ఉన్నాయని వెల్లడించారు. అదనంగా 7.5 లక్షల కమర్షియల్ కనెక్షన్లు కూడా ఉన్నాయని వెల్లడించారు.ప్రతి నెల రాష్ట్రంలో 58 లక్షల నుంచి 60 లక్షల వరకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయని మంత్రి వివరించారు. ఇటీవల కొన్ని రోజులుగా ప్రజల్లో ఆందోళన కారణంగా బుకింగ్స్ రెట్టింపు అవుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ గృహ వినియోగ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి సమస్య లేదని స్పష్టం చేశారు. ప్రతిరోజూ సుమారు 2.5 లక్షల గ్యాస్ సిలిండర్లు సరఫరా జరుగుతున్నాయని తెలిపారు. గత రెండు రోజులుగా కూడా ఎక్కువగా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసినట్లు మంత్రి చెప్పారు.అయితే కమర్షియల్ సిలిండర్ల విషయంలో కొంత కొరత ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో రోజుకు సుమారు 23 వేల కమర్షియల్ సిలిండర్లు అవసరం ఉండగా ప్రస్తుతం 6,200 మాత్రమే సరఫరా చేయగలుగుతున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కమర్షియల్ సిలిండర్ల సరఫరా 20 శాతం పరిమితిలోనే జరుగుతోందని చెప్పారు. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

## ప్రజల కోసమే.. ఆశీర్వాద యాత్ర



**కరీంనగర్, మార్చి 14 :** సమాజానికి మంచి చేయాలని, తమను గెలిపించిన ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడాలని కోరుతూ అంజన్న ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్నామని కేంద్ర హోం శాఖ సాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్ద అంజన్న ఆశీర్వాద యాత్రను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారుజ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పంచాయతీ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ప్రజా ప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయం వద్దకు వస్తానని ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించామన్నారు. దానికనుగుణంగా పార్లమెంట్ పరిధిలోని వార్డు సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, వార్డు సభ్యులతో కలిసి మహాపాదయాత్ర చేపడుతున్నామన్నారు. నిత్యం కొలిచే మహాశక్తి అమ్మవారి ఆలయం నుంచే కొండగట్టుకు ఆధ్యాత్మిక యాత్రను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులు ఆందోళనకు గురి కావద్దని, కష్టపడి చదివారని, ఇష్టపడి రాయాలన్నారు. పదో తరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు ఇబ్బందులు లేకుండాపాదయాత్ర చేపట్టాలని సూచించారు.